జోరువాన

- ఎడతెరిపి లేకుండా వర్షం
- జలమయమైన కాలనీలు
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- జలకళను సంతరించుకున్న చెక్‌డ్యాంలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- రక్షణ చర్యలు చేపట్టిన అధికారులు

ఉధృతంగా ప్రవహిస్తున్న ముక్కిడిగుండం-కొల్లాపూర్ పెద్దవాగు

సిర్సవాడ గ్రామ సమీపంలో అలుగు పారుతున్న దుందుభీ నది చెక్‌డ్యాం

నాగర్‌కర్నూల్, ఆగస్టు 31: రెండు రోజులుగా జిల్లాలో జోరువాన కురుస్తోంది. శుక్రవారం మధ్యరాత్రి నుంచి ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా శనివారం పొద్దుపోయే దాకా కురిసింది. శనివారం ఉదయం వరకే జిల్లాలోని అన్ని మండలాల్లో 52.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాయంత్రానికి 55.45మి.మీ. నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు వెల్లడించారు. అన్ని మండలాల్లోని చెక్‌డ్యాంలు నిండుకోగా, చెరువు, కుంటల్లోకి నీరు చేరింది.

జలమయమైన కాలనీలు...

నాగర్‌కర్నూల్ పట్టణంతోపాటు మున్సిపల్ పరిధిలోని అన్ని గ్రామాలు జలమయమయ్యాయి. పట్టణంలోని ప్రధాన రహదారిలో వర్షపునీరు నిల్వ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శ్రీపురం రోడ్డున గల బీసీ కాలనీలో వర్షపునీరు ఇళ్లలోకి చేరుకున్నది. కనీసం కాలినడకన వెళ్లేందుకు సైతం వీలు లేకుండా పోయిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు బాగు చేసి తమ సమస్యలు తీర్చాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. లోతట్టు ప్రాంతాలైన ఈశ్వర్ కాలనీ, రాంనగర్ కాలనీ, రాఘవేంద్ర కాలనీలోని 9 జంక్షన్ ప్రాంతాలు, ఇండ్ల మధ్య వర్షపునీరు కుంటలను తలపించేలా నిలిచిపోయింది. పలు కాలనీల్లో మున్సిపల్ సిబ్బంది డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి వర్షపునీటిని చెరువుల్లోకి మళ్లించారు.

పొంగిపొర్లిన వాగులు, వంకలు..

కొల్లాపూర్, ఆగస్టు 31 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నియోజకవర్గవ్యాప్తంగా చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. ముక్కిడిగుండం-కొల్లాపూర్ మధ్య పెద్దవాగుకు ఉధృతంగా పారుగుతున్నది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చెరువులు, కుంటలు అలుగులు పారి పంటలు నీటమునిగాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 246.6 మి.మీ.వర్షపాతం నమోదైంది. కొల్లాపూర్ మండలంలో 60.4 మి.మీ., పెంట్లవెల్లి మండలంలో 22.4, కోడేరులో మండలంలో 81.4, పెద్దకొత్తపల్లి మండలంలో 100.4 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ప్రజలు పాత ఇండ్లల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు తరలాలని కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజు సూచించారు. ప్రజలు వాగులను దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కోడేరు మండలంలోని బావాయిపల్లి, ఖానాపూర్, కొల్లాపూర్ మండలంలోని పెద్దవాగుపై రాకపోకలను నిలిపివేసినట్లు తెలిపారు.

నల్లమలలో ఎడతెరిపిలేని వాన

అమ్రాబాద్, ఆగస్టు 31 : అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాలు జోరువానకు తడిసిముద్దవుతున్నాయి. అచ్చంపేట-మద్దిమడుగు ప్రధాన రహదారిపై వర్షపు నీళ్లు ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

నిలిచిన రాకపోకలు..

కోడేరు, ఆగస్టు 31 : కోడేరు మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు నీటితో ప్రవహిస్తున్నాయి. కోడేరు-పస్పుల మధ్య వాగులో ఉండడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బావాయిపల్లి వాగు నీటితో తీగలపల్లి నుంచి పెద్దకొత్తపల్లి వెళ్లే వనపర్తి డిపో బస్సు నీటిలో వెళ్లలేక నిలిచిపోయింది. వాగులు దాటవద్దని రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఖానాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది.

కూలిన ఇండ్లు..

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 31 : మండలంలోని వెన్నచర్లకు చెందిన వెంకటయ్య ఇల్లు వర్షానికి కూలిపడింది. సాతాపూర్‌లోనూ షఫీకి చెందిన ఇల్లు కూలిపోయింది. గ్రామాల్లో పాత ఇండ్లల్లో నివసించే ప్రజలకు రెవెన్యూ అధికారులు పలు సూచనలు చేసి అప్రమత్తం చేశారు. మండలంలో భారీ వర్షానికి 100 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తాసీల్దార్ ఇంబ్రహీంఅలీ తెలిపారు.

కూలిన మట్టిమిద్దె : తప్పిన ప్రమాదం

లింగాల,ఆగస్టు 31 : రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని చెన్నంపల్లి-అప్పాయిపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గంలో చిన్నవాగు ప్రవహిస్తున్నది. దీంతో ధారాంరం సమీపంలో ఉన్న చీకటి చెరువు, అవుసలికుంట వద్ద ఉన్న గుడెంచెరువు తదితర చెరువులు అలుగులు పారుతున్నాయి. చెన్నంపల్లి-పద్మన్నపల్లి గ్రామాల మధ్యలోని పెద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పద్మన్నపల్లిలో వాగులు పారుతుండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

బల్మూరులో..

బల్మూరు, ఆగస్టు 31 : మండలంలోని బాణాల-అచ్చంపేటకు వెళ్లే రహదారిలో వాగులు పారడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పాత ఇండ్లల్లో ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని తాసీల్దార్ శైలేంద్రకుమార్, ఎస్సై గురుస్వామి, ఆర్ఐ శివకుమార్ సూచించారు.

నిండిన చెరువు..

తిమ్మాజిపేట, ఆగస్టు 31: తిమ్మాజిపేట మండలంలో శనివారం కుండపోతగా వర్షం కురిసింది. శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో మండలంలోని తిమ్మాజిపేట, ఎదిరేపల్లి, మారేపల్లి, గుమ్మకొండ, అప్పాజిపల్లి, ఇప్పలపల్లి, పుల్లగిరి తదితర గ్రామాల్లో చెరువు, కుంటలు నిండాయి. వాగు వంకలు పొంగిపొర్లాయి. గుమ్మకొండ, మారేపల్లి గ్రామాల్లో వరి పంటలు మునిగాయి. మండలంలో 8.6 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు తాసీల్దార్ మోహన్ తెలిపారు. నరుకులమ్మ చెరువు అలుగు పారడంతో జడ్చర్ల, నాగర్‌కర్నూల్, ఆవంచ ప్రాంతాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

తాడూరులో..

తాడూరు, ఆగస్టు 31 : మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుసింది. సిర్సవాడ నుంచి మాదారానికి వెళ్లే ప్రధాన రహదారి దుందుభీ వాగు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. చెక్‌డ్యాంలు అలుగులు పారడంతో మాదారం నుంచి సిర్సవాడ వచ్చే బస్సులు, ఇతర వాహనాలు, వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

బిజినేపల్లిలో మోస్తరు వర్షం

బిజినేపల్లి, ఆగస్టు 31 : మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. నిరంతరాయంగా వర్షం పడుతుండడంతో మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండాయి. వాగులు పొంగి పొర్లుతున్నాయి. ప్రధాన రహదారులపై వర్షపునీరు పారుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే గత నెలలో నాటిన వరి పంటలు నీట మునిగాయి.

ఉమామహేశ్వరంలో జలపాతం

అచ్చంపేట రూరల్, ఆగస్టు 31 : ఉమామహేశ్వర ఆలయంపై కొండల నుంచి జలపాతం జాలువారింది. ఈ దృశ్యాన్ని పర్యాటకులు తిలకించి మధురానుభూతి పొందారు. ఫోన్లలో సుందర దృశ్యాన్ని చిత్రీకరించి సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో కొండచరియలు విరిగిపడే అవకాశ ముందని, భక్తులు, పర్యాటకులు ఆలయానికి రావొద్దని ఈవో శ్రీనివాసరావు, ఎస్సై రాములు సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి..

వెల్దండ, ఆగస్టు 31 : వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాని తాసీల్దార్ రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మరో మూడు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే ప్రత్యేక సహాయ కేంద్రాలైన 9059375085, 9666401193 ఫోన్‌నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

వరదలో ఇరుక్కుపోయిన కారు

అచ్చంపేట రూరల్, ఆగస్టు 31 : పట్టణంలోని మల్లమ్మకుంట సమీపంలో వరదలో కారు చిక్కుకోవడంతో యువకులు శ్రమించి బయటకు తీశారు. పత్తి, వరి, మిరప, పామాయిల్ పంటల కు ఈ వర్షం మేలు చేకూర్చిందని రైతులు తెలిపారు. మం డలంలోని పలు వాగులు ఉధృ తంగా పారాయి. ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని అధికా రులు సూచించారు.



బిజినేపల్లిలో నీట మునిగిన వరి

రఘుపతిపేట దుందుభీ నది వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఉధృతంగా దుందుభీ ప్రవాహం

కల్వకుర్తి రూరల్, ఆగస్టు 31 : కల్వకుర్తి మండలం రఘుపతిపేట వద్ద దుందుభీ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. రఘుపతిపేట- తెల్కపల్లి ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం సాయంత్రం కల్వకుర్తి సీఐ నాగార్జున, తాసీల్దార్ ఇబ్రహీం రఘుపతిపేట వాగు వద్ద పరిస్థితిని పరిశీలించి వాగులోకి ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. పైభాగం నుంచి వరద ఉధృతి ఎక్కువగా వస్తుండడంతో వాగులోకి నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. రఘుపతిపేట వద్ద పహారా ఏర్పాటు చేసినట్లు సీఐ, తాసీల్దార్ పేర్కొన్నారు.

రోడ్డుకు కంచె ఏర్పాటు

ఊర్కొండ, ఆగస్టు 31 : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దుందుభీ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో ఎస్సై వీరబాబు సిబ్బందితో కలిసి శనివారం సిర్సవాడకు వెళ్లే మార్గానికి మాదారం శివారులో రోడ్డుకు అడ్డంగా కంచెను ఏర్పాటు చేశారు.

వర్షానికి కూలిన ఇల్లు

బిజినేపల్లి, ఆగస్టు 31: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మండలంలోని వడ్డెమాన్ గ్రామంలో ఆశమ్మ ఇల్లు శనివారం కూలిపడిపోయింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు రాజేశ్, విష్ణువర్ధన్‌రెడ్డిలు బాధితురాలి ఇంటికి వెళ్లి పరిశీలించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

శిథిలావస్థ ఇండ్లలో ఉండొద్దు..

చారకొండ, ఆగస్టు 31 : వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసీల్దార్ కేసీ ప్రమీల సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 8079201198, 9000121252 ఫోన్‌నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- సహాయం కోసం 08540-230201 టోల్‌ఫ్రీ ఏర్పాటు
- కలెక్టర్ సంతోష్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 31: రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పటిష్టి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోని తుఫాన్‌గా ఏర్పడిన నేపథ్యంలో 48 గంటల్లో జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో శనివారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటిపారుదల, విద్యుత్ శాఖల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ముందస్తు చర్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను కలెక్టర్ వివరించారు. రానున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అధికారులు, సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని, మట్టి ఇళ్లలో నివసించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్థానికంగా ఉండాలని ఆదేశించారు. రోడ్లు, కల్వర్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, తెగిన కల్వర్టులు ఓవర్‌ఫ్లో అయినట్లయితే అటువైపు ఎవరూ వెళ్లకుండా బారికేట్లు ఏర్పాటు చేసి సిబ్బందిని ఉంచాలన్నారు. శిథిలావస్థలో మట్టి ఇళ్లలో ఉన్న కుటుంబాలను వెంటనే ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్పా ప్రయాణం చేయడం, బయటకు వెళ్లడం మానుకోవాలని కలెక్టర్ సూ చించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళొద్దని, పశువులను నదుల వద్దకు తీసుకెళ్లకూడదని రైతులకు సూచించారు. ఏదైనా సమస్యలు వస్తే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబర్ 08540-230201 ఫోన్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, దేవసహాయంతోపాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, ఆగస్టు 31 : కొల్లాపూర్ నియోజకవర్గంలోని కృష్ణానది తీర ప్రాంత ప్రజలు, లోతట్టు ప్రాంతాలు, మట్టిమిద్దెల్లో నివసించే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగిపొర్లుతున్నాయని, అత్యవసరమైతే తప్పా బయటకు రావొద్దని సూచించారు. మట్టి మిద్దెల్లో నివసించే వారు సురక్షిత ప్రదేశాల్లో ఉండాలన్నారు. వరద ఉధృత్తి దృష్ట్యా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టులో ప్రాంతాల్లో నిత్యావసర సరుకులతో పాటు సౌకర్యాలు కల్పించాలన్నారు.

పెండింగ్ కేసులు సత్వరం పరిష్కారించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజేశ్‌బాబు

- జిల్లా జడ్జి రాజేశ్‌బాబు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 31: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రాజేశ్‌బాబు ఆదేశించారు. శనివారం జిల్లా కోర్టు హాల్‌లో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల పరిష్కారానికి న్యాయమూర్తులు, పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులతో జిల్లాస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కోర్టు పరిధిలో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. హైకోర్టులో బెంచ్ మీద రోజు 30కేసులు పరిష్కారిస్తానని తెలిపారు. విచారణ అధికారులు కోర్టులో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విచారణ అధికారులు విధిగా హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. జిల్లాలో 7,654 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి పోలీస్, ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిష్కరించే కేసులను సంబంధిత విచారణ అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట అధికంగా కేసుల పెండింగ్ ఉన్న వాటిని ఆయా న్యాయమూర్తులతో వీసీ ద్వారా సమీక్షించారు. జిల్లాలో మొదటిసారి నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా అధికారులు న్యాయమూర్తుల సమిష్టి కృషితో 16 వేల కేసులు పరిష్కరించడం జరిగిందని, సెప్టెంబర్ 28న చేపట్టనున్న జాతీయ లోక్ అదాలత్ ద్వారా చేపట్టనున్న 17వేల కేసులు పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి సబిత మాట్లాడుతూ జిల్లాలో అత్యధికం గా పీటీ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, పరిష్కారానికి పోలీస్ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో జూనియర్‌సివిల్ జడ్జి మౌనిక, మొదటి జూనియర్ జడ్జి మమతారెడ్డి, రెండో జూనియర్ జడ్జి శ్రీనిధి, జిల్లా ఎక్సైజ్ అధికారిని గాయత్రి డీఎస్పీ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, సీఐలు, ఎస్సై, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్రాబాద్ ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు

ఉధృతంగా ప్రవహిస్తున్న కోడేరు పస్పుల వాగు

జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారులపై నిలిచిన వర్షపు నీళ్లు

అలుగుపారుతున్న మారేపల్లి కావేరమ్మ చెరువు

ఘనంగా బీరం జన్మదిన వేడుకలు

కొల్లాపూర్‌లో వర్షంలోనూ కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొల్లాపూర్, ఆగస్టు 31 : కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కొల్లాపూర్ పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు సాంబశివుడు ఆధ్వర్యంలో 20వార్డుల్లో బీరం జన్మదిన వేడుకలను నిర్వహించారు. జోరుగా వర్షం కురుస్తున్నా పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లో భారీ కేక్‌ను కట్ చేసి పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 31 : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకుడు రవినాయక్ తదితరులు ఉన్నారు.

పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి, ఆగస్టు 31 : కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, సురేందర్ గౌడ్, జటప్రోల్ మాజీ సర్పంచ్ ఎస్‌కే ఖాజా, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రఫీ, నాయకులు హుస్సేన్, సుమన్‌గౌడ్, సుల్తాన్‌పాషా, రాంబాబు, నర్సింహ, బ్రహ్మం, బాలస్వామి, శ్రీను తదితరులు ఉన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరందించాలి

వెల్దండ, ఆగస్టు 31 : కల్వకుర్తి నియోజకవర్గంలో కేఎల్ఐ ద్వారా వ్యవసాయానికి సాగునీరు అందించాలని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నేత పుట్టా రాంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వెల్దండ బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండడంతో కృష్ణ, తుంగభద్ర, జూరాల ప్రాజెక్టులు ఉప్పొంగి దిగువకు నీరు పారుతుందన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలో రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కేఎల్ఐ డీ-82 కాల్వ ద్వారా చివరి ఆయకట్టు మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగునీరు అందించేది ఎప్పుడని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, అశోక్, భక్యానాయక్ పాల్గొన్నారు.

వసతిగృహంలో వైద్య శిబిరం

అమ్రాబాద్, ఆగస్టు 31 : పదర మండలంలోని వంకేశ్వరం ఎస్సీ బాలుర వసతి గృహంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సుధాకర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. 61మంది విద్యార్థులకు అనారోగ్య లక్షణాలు కనిపించాయని, చికిత్స చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ సరస్వతి, హెల్త్ అసిస్టెంట్లు మల్లయ్య, మురళీధర్‌రావు, మాధవాచారి, కృష్ణ, బిచ్చులు, ఆశకార్యకర్తలు భాగ్యమ్మ, అనిత, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

బంజారా కాలనీలో తీజ్ ఉత్సవాలు

లింగాల, ఆగస్టు 31 : మండల కేంద్రంలోని బంజార కాలనీ మేరమా భవానీ ఆలయం ఆవరణలో శనివారం తీజ్ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి రోజు తీజ్లా దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బంజార నాయకులు మాట్లాడుతూ.. తీజ్ ఉత్సవాలు 9రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని, ఒక్కో రోజు ఒక్కో దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. పెళ్లికానీ బంజార యవతులు 9రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపడుతారన్నారు. కార్యక్రమంలో మద్దిమడుగు దేవస్థాన పీఠాధిపతి జయరాం గురుస్వామి, బంజార నాయకులు బాలాజీ, శంకర్‌రాథోడ్, శంకర్‌నాయక్, కిషన్‌లాల్, కిషన్‌నాయక్, భద్రునాయక్, దేవేందర్ పాల్గొన్నారు.

పంటలకు సాగునీరు అందిస్తాం

- అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్, ఆగస్టు 31 : నియోజకవర్గంలోని పంటలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని పుల్జాల సమీపంలోని కేఎల్ఐ కాల్వ నుంచి గిరాయికుంటకు సాగునీరు అందించేందుకు పనులకు రైతులు, నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. కాల్వ నుంచి లిఫ్ట్ ద్వారా గిరాయికుంటకు నీటిని తరలించడం ద్వారా 100ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు వీలవుతుందన్నారు. అనంతరం మండలంలోని ఉమా మహేశ్వరాలయంలో పూజలు చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్ భవనానికి భూమిపూజ

అమ్రాబాద్, ఆగస్టు 31 : మండలంలోని మన్ననూర్ ఐటీఐ కళాశాల ఆవరణలో స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శనివారం భూమిపూజ చేశారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీపీ)ను ప్రవేశపెడుతుందని, మొత్తం ఆరు కోర్సులను రెండు సంవత్సరాల్లో పూర్తయ్యేలా నిర్ణయించినట్లు తెలిపారు.

సహకార బ్యాంక్‌ను సందర్శించిన చైర్మన్

కల్వకుర్తి, ఆగస్టు 31 : పట్టణంలోని కేంద్ర సహకార బ్యాంకును శనివారం డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సందర్శించారు. రెండు రోజుల కిందట కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని పీఏసీసీఎస్ చైర్మన్లు డీసీసీబీ చైర్మన్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. స్పందించిన చైర్మన్ చైర్మన్లతో సమావేశమయ్యారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్లు జనార్దన్‌రెడ్డి, గురువయ్య, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ రగునాథ్‌రెడ్డి, సీఈవో వెంకట్‌రెడ్డి, విష్ణుమూర్తి, శ్రీనివాసులు, వెంకటయ్య, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

చారకొండ, ఆగస్టు 31 : ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, విష జ్వరాలతో బాధపడుతున్నా పట్టించుకోవడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 తలపెట్టిన డీఎంహెచ్‌వో కార్యాలయం ముట్టడికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★మహబూబ్‌నగర్, భగీరథ కాలనీ, E/F, 200 చ.గ.ల ప్లాటు అమ్మబడును, కంపౌండ్ వాల్, గేటు కలదు, క్లియర్ టైటిల్ సంప్రదించండి సెల్: 6301465612
NT-MBNR

KIDNY STONES
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: వైశ్యా డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580
NT- 332617

ADMISSIONS
★Seats available in Engineering, Med